తెల్ల బంగారం ఇంటికి చేరేనా?



కూలీలు దొరకక పత్తి ఏరుతున్న రైతులు

- కూలీల కొరతతో చేలలోనే పత్తి
- మహారాష్ట్ర కూలీల కోసం ఎదురుచూపు
- ఆందోళనలో రైతులు

గుడిహత్నూర్: విత్తనం విత్తినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. భూమిని నమ్ముకొని పంటలు సాగు చేసిన రైతులకు నష్టాలు తప్పా.. లాభాలు రావడం లేదు. జూన్‌మొదటి వారంలోనే పత్తి విత్తుకున్న రైతులు అవి మొలకెత్తక నష్ట పోయారు. పత్తి కాత పూత దశకు చేరగానే అధిక వర్షాలతో మొక్కలు వడలి పోయాయి. ఫలితంగా ఆశించిన కాత రాలేదు. ప్రస్తుతం పత్తి చేతికి వస్తున్నా.. కూలీల కొరత తీవ్రంగా ఉంది. పత్తి ఏరేందుకు కూలీలు దొరకక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

నేల రాలితే నష్టాలే..

మండలంలో 25,326 ఎకరాల్లో పత్తి సాగవుతోంది. చేలలో పత్తి పగిలి పక్షం రోజులు అవుతుంది. పలిగిన పత్తిని చూసి రైతులు మురిసి పోవాలా.. పత్తి ఏరేందకు కూలీలు దొరకక పోవడంతో బాధప డాలా? ఏమీ చేయలేని నిస్సాహయ స్థితిలో ఉన్నారు. సకాలంలో ఏరకపోతే పత్తి నేలరాలి నష్ట పోయే అవకాశం ఉంది. దీంతో రైతులు కూలీల కోసం ఉదయాన్ని పల్లెల బాట పడుతున్నారు. సకాలంలో కూలీలు దొరకక పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన కూలి..

మామూలుగా వ్యవసాయ పనులకు వచ్చే కూలీలకు రూ.200 నుంచి 300లు ఇస్తున్నారు. కానీ పత్తి ఏరే విషయంలో కూలి రేట్లు వేరేలా ఉంటున్నాయి. గత ఏడాది కిలో పత్తి ఏరితే రూ.5 నుంచి రూ.6 చొప్పున ఇచ్చారు. ఈఏడాది కూలీల కొరత కారణంగా డిమాండ్ పెరిగింది. కిలోకు రూ.7 ఇస్తే గాని పనికి రామంటున్నారు కూలిలు. ఒకొక్క మహిళా రోజుకు 60 నుంచి 90 కిలోల వరకు పత్తి ఏరి రూ.400 నుంచి రూ.600 వరకు కూలి తీసుకుంటుంది.

మహారాష్ట్ర కూలీలతో..

స్థానికంగా కూలీల కొరత ఉండడంతో మహారాష్ట్ర లో తమకు తెలిసిన వారికి సమాచారం అందించి ముందే కూలి రేట్లు మాట్లాడుకొని ఇక్కడికి రప్పించుకుంటున్నారు. ఇప్పటికే బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ, తాంసి, తలమడుగు మండలాల్లో మహారాష్ట్ర కూలీలు వచ్చి పని చేస్తున్నారు. అయితే సన్న, చిన్నకారు రైతుల వద్దకు కూలీలు రావడానికి అయిష్టత చూపుతున్నారు. వారి చేలలో దిగుబడులు తక్కువ ఉండడంతో గిట్టుబాటు కాదని అంటున్నారు. మరో వైపు పత్తి దొంగలు ఉండడంతో రాత్రిళ్లు చేను వద్ద కాపలా ఉండాల్సి వస్తోందని రైతులు దిగాలు చెందుతున్నారు.

ఇద్దరమే ఏరుతున్నాం



కూలీలు దొరకక పోవడంతో వారం రోజులుగా కుటుంబస భ్యులమే పత్తి ఏరుతున్నాం. దొరికిన కూలిలకు కిలోకి రూ.7 నుంచి రూ.8 అడుగుతున్నారు. పెట్టుబడులు మిగిలితే చాలు అనే ఉద్దేశంతో గత్యంతరం లేక మేమే కష్టపడుతున్నాం.

– ముండే రాందాస్, ముత్నూర్

ఉపాధి కూలీల ద్వారా ఏరివేయాలి



ఉపాధిహామీ కూలీల ద్వారా రైతు చేలలో పత్తి ఏరివేత చేపట్టితే అటు కూలీలకు మంచి కూలీ అందడమే కాకుండా రైతులకు సైతం ఉచితంగా పత్తి ఇంటికి చేరుతుంది. దీంతో సాగు నష్టాలను పూడ్చి కొంత వరకైనా సాగులో నిల దొక్కుకోవచ్చు.

– జి.కోండిబా, రైతు, కొల్హారీ

కేంద్ర నిధులు తీసుకురాని అసమర్థులు

- ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న



పాల్గొన్న కాలనీవాసులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ అభివృద్ధిపై చిత్తశుద్ధి లేని, కనీసం కేంద్ర నిధులు తీసుకురాని అసమర్థులు బీజేపీ నాయకులని బీఆర్ఎస్ అభ్యర్థి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న మండిపడ్డారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీ, కైలాస్‌నగర్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కర్ఫ్యూలు ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమంతో ముందుకు సాగుతున్నామన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో నిజమైన అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలు కులమతాలకు అతీతంగా బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నారని అన్నారు. కారు గుర్తుకు ఓటువేసి మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. సోయం బాపూరావు ఎంపీగా గెలిచిన తరువాత ఒక్క అభివృద్ధి పని చేయాలేదని విమర్శించారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో గంగారెడ్డి, నజీర్ అహ్మద్, సలీం పాషా, దాసరి రమేశ్, శ్రీనివాస్, మున్న, పటేల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాలి

- బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావు

తలమడుగు: నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని, రైతులకు రుణమాఫీ చేయని, డబుల్ బెడ్ రూం ఇవ్వని బీఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావు అన్నారు. గురువారం మండలంలోని కజ్జర్ల, దేవాపూర్, లచ్చమ్‌పూర్, పల్లి(బి), సక్నాపూర్, బరంపూర్, తలమడుగు, ఆర్లి, కొత్తూరు, సుంకిడి, ఖోడద్ గ్రామాల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. గత పదేళ్ల కాలంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను ఎక్కడ నెరవేర్చలేదన్నారు. మళ్లీ బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కొత్తగా ఒక రేషన్‌కార్డు అందించిన దాఖలు లేవన్నారు. కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, రమణ, మండల కన్వీనర్ స్వామి, ధనుంజయ్, కిరణ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు,



తలమడుగు: ప్రచారం చేస్తున్న సోయం బాపూరావు



బోథ్: సొనాలలో నాయకుల ప్రచారం

బోథ్: మండలంలోని సొనాలలో బీజేవైఎం నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ.. బీజేపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. సోయం బాపూరావును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్

- ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్

జైనథ్: అమలుకు సాధ్యం కానీ పథకాలతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ ఆరోపించారు. గురువారం మండలంలోని లేకర్‌వాడ, సాంగ్వి, కౌఠ, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రజల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ అని అన్నారు. గ్రామ పంచాయతీలకు కోట్ల రూపాయాల నిధులు కేంద్రం మంజూరు చేసిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పక్కదోవ పట్టించారని మండిపడ్డారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఆదిలాబాద్‌కు చేసిందేమి లేదని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్, లోక ప్రవీణ్ రెడ్డి, అస్తక్ సుభాష్, కరుణాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, నరేశ్, రాజు, బింగి వెంకన్న పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న పాయల్ శంకర్

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే పోటీ

- ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే పోటీ ఉంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈనెల 25న ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించే రాహుల్ గాంధీ సభకు ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. గురువారం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని లాండసాంగ్వి, జందాపూర్, మొలాల్‌గుట్ట, ధర్‌లొద్దీ, ఖండాల(కే), ఖండాల(బి), పోతగూడ, రాజుగూడ, మామిడిగూడ, జంబుల్‌ధరి, సల్పలగూడ, లింగుగూడ, వాన్‌వాట్, లోకారి (కే), లోకారి(బి), కొత్తూర్, చింతల్‌బోరి, తంతోలి గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని టీపీసీసీ రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం మావల మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు ధర్మపురి చంద్రశేఖర్, భూపెళ్లి శ్రీధర్, సంపేర్ల అడెల్లు, అట్ల గోవర్ధన్ రెడ్డి, సురేశ్, రహీం ఖాన్, ఆత్రం శంకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

న్యాయశ్రీ అవార్డుకు సుధీర్‌కుమార్ ఎంపిక

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాధి సంగెం సుధీర్‌కుమార్ న్యాయశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. న్యాయవ్యవస్థలో అత్యున్నత సేవలకు మధర్ పౌండేషన్, మేఘాసిటీ నావకాశా వేదిక ఆధ్వర్యంలో ప్రదానం చేస్తున్నారు. 25న హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో హైకోర్టు న్యాయమూర్తి సురేపెల్లి నంద, సరస్వతి పుత్రులు దైవజ్ఞశర్మ, భీంరావు య శ్వంత్ అంబేద్కర్ చేతులు మీదుగా అందుకొనున్నారు.

'రైతులకు అండగా కాంగ్రెస్'

బజార్‌హత్నూర్/నేరడిగొండ/తాంసి/బోథ్: కాంగ్రెస్ రైతులకు అండగా ఉంటుందని బోథ్ కాంగ్రెస్ అభ్యర్థి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని బజార్‌హత్నూర్, దేగామ, బోస్రా, రాంపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, జల్కే పాండురంగ్, అశోక్, రాజు, శేఖర్ పాల్గొన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాంసి మండలంలోని కప్పర్లలో ఆడే గజేందర్ గెలిపించాలని నాయకులు ప్రచారం నిర్వహించారు. బోథ్ మండలంలోని సొనాలలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీలను వివరించారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఆడే గజేందర్

- బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్/గుడిహత్నూర్: ఎన్నికల్లో ఓటు వేసి ఆదరిస్తే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. గురువారం బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ, మంజరంతండా, టెంబి, బజార్‌హత్నూర్ గ్రామాల్లో, గుడిహత్నూర్ మండలంలోని శాంతాపూర్, గోండ్ హర్కాపూర్, బెల్లూరి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు మేకల వెంకన్న, నానం రమణ, కవిత రఘున్ రెడ్డి, కుర్మే నారమ్మ లక్షణ్, విద్యాసాగర్, జ్ఞానేశ్వర్, ఈశ్వర్, పరచ సాయన్న, చట్ల గజ్జయ్య పాల్గొన్నారు.

బోథ్/తాంసి/తలమడుగు/ఇచ్చోడ/నేరడిగొండ: గ్రామాలన్నీ బీఆర్ఎస్ వైపు ఉన్నాయని మాజీ ఎంపీ గొడం నగేశ్ అన్నారు. గురువారం మండలంలోని పొచ్చర, కుచులాపూర్, కౌఠ(బి), కనుగుట్ట గ్రామాల్లో ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బోథ్ మండలంలోని పొచ్చర, కుచులాపూర్, ధన్నూర్, కౌఠ(బి), కనుగుట్ట, బోథ్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. భీంపూర్ మండలంలోని తాంసి(కె) గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనిల్‌జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తలమడుగు మండలంలోని ఉమ్రీ, కోసాయి, ఝరి, పల్సి(బి), పల్సి తండా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డిలు ప్రచారం చేశారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. నేరడిగొండ మండలంలోని యాపల్‌గూడ, గుత్పాల, రోల్‌మామడ, శంకరాపూర్, సవర్గాం, కుంటాల, వడూర్ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వ నిర్వహించారు. ఎంపీపీ రాథోడ్ సజన్, అల్లూరి శివారెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా



దేగామలో ప్రచారం చేస్తున్న అనిల్‌జాదవ్

- ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

పెంబి: నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలు, తండాలకు రోడ్లు వేయించి అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్య జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు రాయదారి, అంకెన, కర్ణంలొద్ది, పోచంపల్లి, పుల్గంపాండ్రి, పెంబితండా, ఇటిక్యాల్, లోతర్యతండా, తాటిగూడ, మందపల్లి, నాగాపూర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పుల్గంపాండ్రి గ్రామం నుంచి ఇచ్చోడకు రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

జాన్సన్‌నాయక్ గెలవాలని పొర్లుదండాలు

ఖానాపూర్: ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్ గెలుపొందాలని పట్టణంలోని శివాజీనగర్ శ్రీ మహాలక్ష్మి ఆలయంలో ఆ పార్టీ నాయకులు పొర్లుదండాలు పెట్టారు. కార్యక్రమంలో ద్యావతి రాజేశ్వర్, గుగ్గిల్ల రాజేందర్ గౌడ్, దాసరి రాజన్న, శంకర్ తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని ఐదో వార్డులో గంగపుత్ర, మాల సంఘం నాయకులతో, పదో వార్డులో తిమ్మాపూర్ పద్మశాలి సంఘం, శ్రీరాంనగర్‌లో ఖానాపూర్ గౌడ సంఘం నాయకులతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీని సన్మానించారు.

గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తా



పెంబిలో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

జన్నారం: నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎండీ రియాజొద్దీన్ అన్నారు. ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు మద్దతుగా గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పొనకల్‌లో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ, మండల అధ్యక్షుడు రాజరాంరెడ్డి ప్రచారం చేశారు.

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె అన్నారు. గురువారం మండలంలోని అంజీ, బోడిందగూడ, కోబ్బయ్‌గూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు.

పంటలపై అడవిపందుల దాడి

- అందని నష్టపరిహారం
- రాత్రి, పగలు రైతుల కాపలా
- జిల్లాలో ఏటా వందల ఎకరాల్లో నష్టం



ధ్వంసమైన పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

తలమడుగు: ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంటలకు రక్షణ లేకుండా పోయింది. రైతులు రాత్రి పగలు పంటను కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదిలాబాద్ జిల్లా అంటేనే అడవుల జిల్లాగా పేరుంది. చుట్టూ అడవులు ఉండడంతో అడవి పందులు గుంపులు గుంపులుగా వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. జిల్లాలో ఎక్కువగా పత్తి, కంది, సోయాబిన్, జొన్న పంటలు సాగు చేస్తున్నారు. రబీలో వేరుశనగ, శనగ, మొక్కజొన్న పంటలను సాగు చేసుకునే రైతులు పందుల బెడదకు జంకుతున్నారు. ప్రతి ఏటా వందల ఎకరాలలో పంటలను అడవి పందులు నశనం చేస్తున్నాయి. తలమడుగు, తాంసి, బేల, బజార్‌హత్నూర్, బోథ్ మండలాల్లో వీటి తీవ్ర అధికంగా ఉంది. గత ఎడాది ఖరీఫ్‌లో పత్తి, కంది పంటలను లక్ష 39 వేల హెక్టర్‌లో సాగుచేశారు. జిల్లాలో 12 వందల ఎకరాలలో పత్తి, జొన్న, కంది, పంటలను నష్టపరిచాయి. కనీసం పెట్టుబడి కూడా రాక రైతులు అప్పుల్లో కూరుకుపోయారు.

దరఖాస్తులకే పరిమితం..

జిల్లాలో గత 2017లో 980, 2018లో 1100, 2019లో 850, 2021 నుంచి 2023 వరకు దాదాపు 1650 ఎకరాల్లో అడవి పందులు పంటలను ధ్వంసం చేశాయి. వ్యవసాయశాఖ అధికారులు, అటవీశాఖ అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి వెళ్లారు. రైతులు ఫొటోలతో సహా దరఖాస్తు చేసుకున్నారు. అయినా.. ఇప్పటి వరకు ఎలాంటి నష్టపరిహారం అందలేదు. పంటనష్టపోయి ఏళ్లు గడుస్తున్నా.. నష్టపరిహారం అందిండం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళ కాపలా..

సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రి, పగలు తేడా లేకుండా పంటపొలాల వద్ద కాపలా కాస్తున్నారు. కొంత మంది రైతులు పంటపొలాల్లో గుడిసెలు వేసుకొని టపాసులు పేల్చుకుంటూ.. కాపలా ఉంటున్నారు. కొన్ని సమయాల్లో అడవిపందులు రైతులపై దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. పందుల నివారణకు టపాసులు పేలచ్చడం, పంట చుట్టూ చీరలు కట్టడం, పెన్సింగ్ కట్టడం చేస్తున్నారు. అయినా కూడా పంటలను నశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

నష్టపరిహారం అందలేదు

గతంలో పత్తి 8 ఎకరాల్లో సాగు చేశాను. అందులో 4ఎకరాల్లో పత్తి పంటను అడవి పందులు పూర్తిగా ధ్వంసం చేశాయి. పోలంలోకి వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, అటవీశాఖ అధికారులు వచ్చి పంటను పరిశీలించారు. అయినా.. ఎలాంటి నష్టపరిహారం రాలేదు.

– వెంకట్‌రెడ్డి, రైతు, తాంసి

బీఆర్ఎస్‌లోకి జనసేన జిల్లా అధ్యక్షుడు

ఇచ్చోడ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనసేన అధ్యక్షుడు ధరవత్ నరేందర్ నాయక్ గురువారం హైదరాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే పార్టీలో చేరినట్లు తెలిపారు. అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

ఖానాపూర్: పట్టణంలోని పంచముఖి హనుమాన్ చౌరస్తాలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పండితులు ప్రసాద్‌శాస్త్రి, హరీశ్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, నిత్యపూజ, మండపపూజ, జమాదిహోమం, పూర్ణాహుతి, కుంభాభిషేకంతోపాటు అభిజిత్ లగ్నంలో శ్రీ గోవిందమాంబసమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం కనుల పండువగా సాగింది. భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

కంటి ఆపరేషన్ల కోసం 21 మంది తరలింపు

ఖానాపూర్: పట్టణంలో దేవి ఐకేర్‌లో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం 21 మందిని ఆర్మూర్‌లోని ఆస్పత్రికి కంటి ఆపరేషన్ కోసం తరలించామని నేత్ర వైద్య సహాయ నిపుణులు నిఖిల్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి విజన్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు రవాణా సౌకర్యం, భోజన వసతి కల్పించామన్నారు. కార్యక్రమంలో మజర్ ఖాన్, దత్తాగౌడ్, షాకీర్, అబ్దుల్ వాసే ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దు

ఖానాపూర్: పట్టణంతోపాటు గ్రామాల్లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వాల్‌రైటింగ్స్, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంసీసీ టీమ్ ఇన్‌చార్జి సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్ గ్రామాల్లో ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, కార్యదర్శి హన్మంతు తదితరులున్నారు.

వృథాగా భగీరథ నీరు



ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్‌లో మిషన్ భగీరథ నీరు వృథా అవుతోంది. వాటర్‌ట్యాంక్ నుంచి గ్రామానికి సరఫరా చేసే పైపులైన్ పగిలిపోవడంతో రోడ్డుపై పారుతోంది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.